విజ్ఞాన ప్రదర్శన అదుర్స్



ఉప్పల్: ఉప్పల్ రాక్‌వుడ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. రకరకాల ప్రాజెక్టులతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. రాక్‌వుడ్ స్కూల్ విద్యాసంస్థల చైర్మన్ రామానాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య బోధన ద్వారనే వారు ఉన్నతులుగా తీర్చిదిద్దుతామన్నారు. సరైన బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులు విద్యపై మక్కువ చూపుతారన్నారు. ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపజేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీప, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బోడుప్పల్: మానసికోల్లాసం, ఉత్సాహానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని బీఎంఆర్ఎస్ గ్రామర్ హైస్కూల్ కరస్పాండెంట్ బి.జైపాల్‌రెడ్డి అన్నారు. ట్రస్మా మేడిపల్లి మండల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల లెవెల్ ఆటల పోటీల్లో బీఎంఆర్ఎస్ విద్యార్థులు ప్రతిభచాటగా వారిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర ఖోఖో జూనియర్స్, బాలికల ఖోఖో జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి లభించినట్లు వెల్లడించారు. చెస్ బాలుర సీనియర్ విభాగం, చెస్ జూనియర్ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో విద్యార్థులు

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడం భేష్



జయసింహను సత్కరించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

రామంతాపూర్: బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతాపూర్–ఇందిరా ఎంపీ రియల్‌లోని సిమ్‌లైన్ ఫిట్‌నెస్ జిమ్ అధినేత కె.జయసింహాగౌడ్ సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించడానికి ఈ నెల 27న వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఆయనను అభినందించే కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయసింహ ఓ వైపు ఆధునిక పరికరాలతో జిమ్ నిర్వహిస్తూ.. మరోవైపు ఎత్తయిన పర్వతాలను అధిరోహించే ట్రెక్కింగ్‌లో కూడా ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. గతంలో జయసింహ టాంజానియాలోని ఎత్తయిన పర్వతాలను అధిరోహించి రికార్డు స్థాపించడం, అదేవిధంగా దక్షిణాఫ్రికాలో 19,341 అడుగుల ఎత్తయిన కిలిమంజరో పర్వతాన్ని అధిరోహించడానికి వెళ్లడం ప్రశంసనీయమని కొనియాడారు. తమ ట్రస్ట్ తరపున జయసింహకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు పాలకూరి శ్రీకాంత్‌గౌడ్, గడ్డం రవికుమార్, డాక్టర్ బి.వి.చారి, సోమిరెడ్డి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



గౌతంనగర్: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ విభాగం నుంచి అందజేసిన క్రిస్మస్ కానుకను మంగళవారం గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ తన పార్టీ కార్యాలయంలో క్రైస్తవులకు అందజేశారు.

బీరప్పగడ్డ కుమ్మరి సంఘం కేలండర్ ఆవిష్కరణ

ఉప్పల్: ఉప్పల్ బీరప్పగడ్డ కుమ్మరి సంఘం కేలండర్‌ను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మంగళవారం వార్డు కార్యాలయంలో ఆవిష్కరించారు. త్వరలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపడతామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, జగన్, శ్యామ్, బాలు, సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు



గౌతంనగర్: దత్తాత్రేయ జయంతి సందర్భంగా వాణీనగర్‌లోని విజయ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్, ఆలయ చైర్మన్ నర్సింగ్ రావు, నాయకులు మేకల రాముయాదవ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో క్రిస్మస్ సందడి



ఉప్పల్: ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. షాపింగ్ మాల్స్‌లోని వ్యాపారులంతా కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చుట్టుపక్కల వారు పెద్ద ఎత్తున డీఎస్ఎల్ మాల్‌కు చేరుకుని సంబురాల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన 40 ఫీట్ల స్నో మ్యాన్ కటౌట్ అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం సైతం పెద్దఎత్తున ప్రజలు స్నోమ్యాన్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. దీంతో పాటు క్రిస్మస్ సందర్భంగా ప్రతి కొనుగోలుపై యాజమాన్యం తరపున లక్కీడ్రా నిర్వహించి అనేక బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

అన్ని మతాల సారాంశం ఒక్కటే..



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న టీచర్లు

మల్లాపూర్: యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నాచారం అకాడమీ హైట్స్ పబ్లిక్ స్కూల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, అందరూ ఒకరినొకరు గౌరవించుకోవాలని సూచించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రష్మీ జైస్వాల్, ఉపాధ్యాయం బృందం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం



శివసాయినగర్ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న బేతి సుభాష్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శివసాయినగర్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం హబ్సిగూడలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 31వ తేదీన శివసాయినగర్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి హాజరుకావాలని కాలనీ కార్యవర్గ సభ్యులు ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి, కొండగళ్ల అశోక్, బర్ల రామచంద్రారెడ్డి, నారా నర్సింహులు, కాసుల సురేష్‌గౌడ్, జూపల్లి అశోక్, సత్యనారాయణరెడ్డి, రమేష్‌రావు, నర్సింహచారి ఉన్నారు.

బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్ బాలాజీ శ్రీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు హవనం, మహా పూర్ణాహుతి, 108 కళాశాల అభిషేకాలు, చక్ర స్నానం గావించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ వంశపారంపర్య చైర్మన్ రాజాసంజయ్ గోపాల్ సెంచర్, కార్యానిర్వాహణాధికారి మఠం వీరేశం, వెంకట్రామిరెడ్డి, శివరామకృష్ణ, రాజ నరసింహరెడ్డి, నాగేష్, సుకన్య పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో విద్యాబోధన జరగాలి



అతిథులను సత్కరిస్తూ..

కొత్త కిశోర్‌గౌడ్

బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో విద్యాబోధన జరగాలని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల 22వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. నేటి యువతీ యువకులు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాణిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు నిధులు కేటాయిస్తూ ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ శ్రీనివాస్, జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, పాఠశాల ఇన్‌చార్జి విజయ్‌కుమారి, నేతలు బందారం నాగేశ్వర్‌గౌడ్, మీసాల యాదగిరి, రాపోలు రామస్వామి, బి.నందప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై అధికారులతో సమావేశం

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి వార్డు సభలు నిర్వహించేందుకు మంగళవారం బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు బోడుప్పల్‌లోని 28 డివిజన్లకుగాను 33 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి కేంద్రానికి ఒక అధికారి, అవసరం మేరకు 4 నుంచి 8 మంది సిబ్బంది కేటాయిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేసి ఆదేశాలు, సూచనలు జారీ చేయడం జరిగింది. ఈ నెల 28వ తేదీన ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం నిర్వహణపై బుధవారం బోడుప్పల్ పాలకవర్గ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విధివిధానాలపై చర్చిస్తామన్నారు.

పోరాటాల స్ఫూర్తితో ముందుకెళ్తాం..



మల్కాజిగిరి: గతంలో చేసిన పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ దశరథ్ అన్నారు. పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కార్యదర్శి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జెండా ఎగురవేశారు. దశరథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందే ఉన్న సీపీఐ నాటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. పాలకులను ప్రశ్నించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. క్రిష్ణమూర్తి, నాగరాజు, అశోక్, అజిత్, యాదగిరి, కమలాకర్ పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని దొడ్లబస్తీ, బీజేఆర్‌నగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లను బడికి వచ్చే పిల్లల వివరాలను వారికి అందుతున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్నిచోట్ల అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయన్న సమాచారం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఇబ్బందులను తెలుసుకున్నామని వాటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుమల్‌నగర్ రిజర్వాయర్ పరిశీలన

తిరుమల్‌నగర్‌లో ఉన్న రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉండే సిబ్బందిని రిజర్వాయర్ సామర్థ్యం, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మల్కాజిగిరిలో ప్రస్తుతం నీటి సరఫరాలో ఇబ్బందులు లేవన్నారు.

వైద్య విద్యార్థికి కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ చేయూత



మేడిపల్లి: వరంగల్‌కు చెందిన ఓ పేద విద్యార్థి పైచదువుల కోసం కేఎన్ఆర్ సంస్థ చేయూత అందించింది. వైద్య విద్యలో పైచదువుల కోసం తగిన ఆర్థిక స్తోమత లేకపోవడంతో గుగులోత్ సలీం నాయక్ అనే విద్యార్థి తనకు సాయం చేయాలని అభ్యర్థించాడు. స్పందించిన ఓ నిర్మాణ సంస్థ జీఎం శ్రీనివాస్‌రెడ్డి రూ.1.80 వేలు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చాడు. చెక్కు రూపంలో పీర్జాదిగూడ 20వ డివిజన్ కార్పొరేటర్ కౌడె పోచయ్య చేతులమీదుగా మంగళవారం అందజేశారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుషాయిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని టీచర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. టీచర్స్ కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి తోడ్పాటు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆలేటి మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బంగారం రాములుచారి, నర్సింగరావు, నాయిని శేఖర్‌రెడ్డి, నరసింహ, ప్రసాద్, కృష్ణానాయక్, రాథోడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

షాపు గోడను కూల్చిన గుర్తు తెలియని వ్యక్తులు



మేడిపల్లి: ఓ చిరు వ్యాపారి దుకాణాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ బస్‌డిపో సమీపంలో శ్రీనివాస్ అనేవ్యక్తి ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని అందులో నిర్మల క్లాత్ స్టోర్స్ పేరుతో 20 ఏళ్లుగా దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఏళ్ల తరబడి నుంచి నిర్వహిస్తున్న తన షాపు కొంత భాగాన్ని రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అకారణంగా తన షాపును కూల్చి తనకు నష్టం కలిగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి పోలీసులను ఆశ్రయించాడు.

దత్తాత్రేయ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్



దత్తాత్రేయ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. సాయంత్రం స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.నాదంచారి, రాజారావు, వీరభద్రరావు, ట్రస్టు అధ్యక్షుడు పాండు, వసంతరావు, మాలాద్రి, రమాదేవి, సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే..

హెచ్‌బీకాలనీ ఫేజ్–2లోని నాగపోచమ్మ ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటు అందిస్తానని బీఎల్ఆర్ అన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పుల్లూరు సదానందం, సెక్రటరి వంజరి ప్రవీణ్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీలో ఆనంద్

బోడుప్పల్: మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి జన్మదినం పురస్కరించుకుని బోడుప్పల్ 14వ డివిజన్‌లో పేదలకు మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బోడుప్పల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బేజాడి బ్రహ్మం, డివిజన్ నాయకులు కళ్లం నవీన్‌రెడ్డి, జమ్మ సురేష్, మురళీకృష్ణ, చంద్రశేఖర్, పురుషోత్తం, సాయి మనోహర్, సత్యనారాయణ, దుస్సా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జేజీఆర్ ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



బోడుప్పల్: బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. డాక్టర్లు జంపాల శ్రీనివాస్, ధరణి, రవితేజ, పాస్టర్లు జయన్న, పన్నీర్ సెల్వం పాల్గొని దేవుని వాక్యంను, క్రిస్మస్ సందేశాన్ని అందించారు. విద్యార్థులు వివిధ వేషాధారణలో అలరించారు. విద్యార్థులు చేసిన పలు సందేశాత్మక నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ 19వ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు, ఇన్‌చార్జి విజయ్ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో లలితకు పీహెచ్‌డీ



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని సుద్దపల్లి లలితకు బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టా లభించింది. ఘట్‌కేసర్ మండలం నారపల్లికి చెందిన ఆమె ప్రొఫెసర్ వి.సుధ ఆధ్వర్యంలో 'భారతీయ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రభావంలో ట్రెండ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రకటించింది. భారతదేశ ఔషధ పరిశ్రమ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్రంగా ఉంది. ఈ పరిశోధన ఫలితంగా భారతీయ ఫార్మాస్యూటికల్ రంగంపై ఎఫ్‌డీఐ విధానాల సరళీకరణ, పరిశ్రమ ఆర్థిక పనితీరుపై ఎఫ్‌డీఐల ప్రభావాలను విస్తృతంగా అర్థం చేసుకోవచ్చు. పరిశోధనకు సహకరించిన రీసెర్చ్ సూపర్‌వైజర్, ఇతర ఉపాధ్యాయులకు లలిత కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం పునర్నిర్మాణ పూజలు మంగళవారం నిర్వహించారు. అర్చకులు వెంకటేశ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఎంపీటీసీ రఘు, ఉపసర్పంచ్ వెంకటేష్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, నాయకులు మల్లారెడ్డి, నానిరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలి




మల్లాపూర్: జర్నలిస్టులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ ఎస్ ఫంక్షన్ హాల్‌లో మేడ్చల్ జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. మెజారిటీ కార్యవర్గ సభ్యుల ఆమోదం మేరకు జర్నలిస్టుల సంక్షేమంతో పాటు యూనియన్ సంస్థగతంగా బలోపేతంపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు వెంటనే కార్యచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోతే వెంకట్‌రెడ్డి, యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ కేసులు ఉంటే వాహనదారులు మేడ్చల్ న్యాయస్థానంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ కోరారు. డ్రంకన్ డ్రైవింగ్, లైసెన్సు లేని డ్రైవింగ్ వంటి కేసులు తక్కువ జరిమానాతో పరిష్కారం అవుతాయని తెలిపారు.

ఘనంగా దత్త జయంతి



మేడ్చల్‌రూరల్: దత్త జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘనాపూర్ గ్రామ పరిధిలోని మల్లిఖార్జున స్వామి గుట్టపై దత్తాత్రేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ జనార్దన్‌రావు, ప్రభావతి దంపతులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్, కో ఆప్షన్ సభ్యులు జీవన్‌రావు భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూడూర్ గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, అర్చకులు వెంకటేశ్‌శర్మ, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్, క్రిష్ణ, మహేశ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

జవహర్‌నగర్: గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొమ్ము విజయ్(27), గిద్ద పవన్‌కుమార్(42), కుంచం ప్రశాంత్(23), అరుణ్‌కుమార్ (30)లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, రెండు చిన్న సీసాలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా నేరమని, చర్యలు తీసుకుంటామని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపారు.